## క్లుప్తంగా

### వ్యాధులపై అప్రమత్తం



సర్వే చేపడుతున్న వైద్య సిబ్బంది

ఎచ్చెర్ల : గ్రామాల్లో ప్రబలుతున్న వ్యాధులపై మురపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది శనివారం సర్వే చేపట్టారు. మురపాకలో ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక వ్యాధులు, సంక్రమణ వ్యాధులు, అసంక్రమణ వ్యాధుల వివరాలను యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

### రావాడలో వైద్య శిబిరం



బీపీ చెక్ చేస్తున్న డాక్టర్

రణస్థలం: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ధన్వంతరి శాఖ సభ్యుడు ఉమామహేశ్వరరావు అన్నారు. రణస్థలం మండలం రావాడ జంక్షన్‌లో లైఫ్ రే ఆసుపత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ పప్పల సౌజన్య నేతృత్వంలో 90 మందికి రక్త పరీక్షలు, మహిళలకు స్కానింగ్‌లు చేశారు. రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ధన్వంతరి యాజమాన్యం, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

### క్రెడాయ్ సేవలు అభినందనీయం



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నిర్మాణ రంగానికి క్రెడాయ్ వంటి సంస్థలు పట్టుకొమ్మలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నిర్మాణ రంగం సక్రమంగా నడవాలంటే క్రెడాయ్ సేవలు మరింత విస్తరించాలన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో క్రెడాయ్ ప్రోపర్టీ షో రెండో రోజు కార్యక్రమానికి శనివారం ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో జరిగితేనే వలసల నివారణ సులువవుతుందన్నారు. కార్యక్రమంలో సుడా పీఓ అమర్‌నాథ్, క్రెడాయ్ అధ్యక్షుడు పొట్నూరు రమేష్ చక్రవర్తి, ఉపాధ్యక్షుడు దుంగ సుధాకర్, సభ్యులు బెండి నాగేశ్వరరావు, గంజి భీమారావు, ఎంఆర్‌సీ రెడ్డి, తంగుడు తిరుపతిరావు, ఎస్.సత్యం, నాయకులు మెండ దాసునాయుడు, మాదారపు వెంకటేష్, అరవల రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

### వెంకన్నకు విశేష పూజలు

శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని మొండేటివీధిలో వేంకటేశ్వరస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి తులసిమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో అర్చనలు, భక్తుల గోత్రనామాలతో పూజలు చేశారు.



మొండెటివీధిలో వెంకన్నకు అలంకరణ

### ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం జగదీశ్వరరావు

జి.సిగడాం: ఉత్తమ విద్యా బోధన అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని సీతంపేట ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చిత్తిరి జగదీశ్వరరావు కోరారు. శనివారం పాఠశాల ఆవరణలో చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కార్పొరేట్, ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడుల్లోనే పదో తరగతి విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని చెప్పారు. ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.కుమార్, స్రవంతి, జగదీష్‌బాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

### నగరపాలక సంస్థలో సర్క్యులేషన్ ప్యాట్రన్ అమలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో పురాతన నిర్మాణాల గల వీధుల్లో వెడల్పు తక్కువగా ఉండి జనసాంద్రత, నిర్మాణ సాంద్రత ఎక్కువ ఉన్న 23 ప్రాంతాల్ని గుర్తించి భవన నిర్మాణాలకు అనుమతి మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏపీడీపీఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని భవన నిర్మాణాలకు అనుమతి పొందవచ్చని పేర్కొన్నారు.

# ఇంటింటా.. సౌర వెలుగులు

- పీఎం సూర్యఘర్ పథకం కింద సోలార్ ప్యానెల్స్ ఏర్పాట్లు
- విద్యుత్ ఆదాతో పాటు డిస్కమ్ గ్రిడ్‌లకు అమ్మకాలు
- ఆసక్తి చూపుతున్న సామాన్యులు





సోలార్ ప్యానెల్, (ఇన్‌సెట్‌లో) రాగోలు గ్రామంలో ఓ ఇంటిపై ఏర్పాటు చేసిన సోలార్ యూనిట్

శ్రీకాకుళం రూరల్:

విద్యుత్ ఆదాలో భాగంగా ఒకప్పుడు సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకోవాలంటే చాలా మొత్తంలో ఖర్చు పెట్టాల్సి వచ్చేది. ప్యానెల్స్ ఏర్పాటు, మెయింటెనెన్స్ ఇతరత్రా పనులకు భారీగా సొమ్ము ఖర్చు చేయాల్సి రావడంతో సామాన్యులు వెనకడుగు వేసేవారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకం సామాన్య ప్రజల పాలిట వరంలా మారింది. సులువుగా అనుమతులు సైతం వస్తుండటంతో శ్రీకాకుళం రూరల్ మండల పరిధిలో సోలార్ విద్యుత్ వెలుగులు ఊపందుకున్నాయి. అధిక మొత్తంలో కరెంట్ బిల్లులు వస్తున్న వారు ఎవరైనా సోలార్ రూఫ్‌టాప్‌ను తమ ఇంటిపైనే ఏర్పాటు చేసుకోవచ్చంటూ విద్యుత్ శాఖతో పాటు సచివాలయ సిబ్బంది విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. దీనికి గాను ఆధార్‌కార్డు, కరెంట్ బిల్లు, బ్యాంక్ అకౌంటు ఉంటే సరిపోతుందని చెబుతున్నారు.

### రాయితీతో కూడిన అవకాశం..

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన కింద సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకునేందుకు మొబైల్ ఫోన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. ఎంపిక చేసిన ఏజెన్సీ నిర్వాహకులు సోలార్ రూఫ్ టాప్ కావాల్సిన వారి ఇంటికి నేరుగా వచ్చి ఒప్పందం చేసుకుంటారు. ఒక కిలోవాట్ సోలార్ సిస్టం కెపాసిటీకి గాను రూ.83వేలు చెల్లించాలి. ఇందులో సబ్సిడీ రూ.30 వేలు లబ్ధిదారుకు వెళ్తుంది. ఈ డబ్బును కట్టాల్సిన అవసరం లేదు. మిగిలిన రూ.50 వేలు బ్యాంక్ ద్వారా లోన్ రూపంలో తీసుకోవాల్సి ఉంటుంది. అదేవిధంగా రెండు కిలోవాట్ల సోలార్‌కు రూ.1,54,000 కాగా, సబ్సిడీ రూ.60వేలు వస్తుంది. మూడు కిలోవాట్ల సోలార్ సిస్టమ్ కెపాసిటీకి రూ.2,06,400 కాగా, రూ.78వేలు సబ్సిడీ వస్తుంది.

### విద్యుత్ నిల్వతో పాటు ఆదాయం..

గతంలో సోలార్ ప్లాంట్ ద్వారా తయారైన విద్యుత్‌ను బ్యాటరీల్లో నిల్వచేసి రాత్రి వేళల్లో ఇంటి అవసరాలకు ఉపయోగించేవారు. ప్రస్తుతం బ్యాటరీలు లేకుండానే ఇన్వర్టర్ సాయంతో డీసీ కరెంట్‌ను ఏసీ కరెంట్‌గా మార్చేసి నేరుగా గ్రిడ్‌కు అనుసంధానిస్తున్నారు. ప్రతి ఆరునెలకొకసారి డిస్కమ్ ఇంట్లో ఏర్పాటు చేసిన నెట్ మీటర్ సాయంతో మనం ఎన్ని యూనిట్లు విద్యుత్ వాడుతున్నామో, ఇంకా ఎన్ని యూనిట్ల విద్యుత్ మిగిలి ఉందో లెక్క వేస్తారు. లబ్ధిదారుడు ఖర్చుచేయగా మిగిలిన యూనిట్లు లెక్క వేసి రూ.4.50 చొప్పున లెక్కించి లబ్ధిదారుని బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారు.

### విద్యుత్ ఉత్పత్తి ఇలా..

సాధారణంగా ఎండ బాగా ఉన్న రోజుల్లో ప్రతి కిలోవాట్‌కు రోజుకు 4 యూనిట్ల కరెంట్ ఉత్పత్తి అవుతోంది. అంటే ఇంటిపై 3 కిలోవాట్లు ప్యానెల్లు అమర్చుకుంటే ప్రతి రోజు 12 యూనిట్లు (కిలోవాట్ అవర్) కరెంట్ ఉత్పత్తి అవుతుంది. దీంతో నెలకు 360 యూనిట్లు తయారవుతుంటుంది. మబ్బులు ఉన్న రోజుల్లో మాత్రం తగ్గిపోతుంది. ఎండాకాలంలో రోజుకు 15 యూనిట్లతో నెలకు 450 యూనిట్లు వరకు ఉత్పత్తి అవుతుంది. ఇందులో ఇంటి అవసరాలకు 250 యూనిట్లు ఖర్చు చేసినా మిగిలిన 110 నుంచి 200 యూనిట్లు విద్యుత్‌ను ట్రాన్స్‌లో డిస్కమ్ గ్రిడ్‌లకు వెళ్లిపోతుంది.

సోలార్ ప్యానెల్

### 250 ఇళ్లపై ఏర్పాటు

ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనకు మంచి స్పందన లభిస్తోంది. శ్రీకాకుళం రూరల్ మండలంలో 290 మంది వరకూ రిజిస్ట్రేషన్ చేసుకోగా అందులో 250 మంది తమ ఇళ్ల వద్ద సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేయించుకున్నారు.

– బొడ్డేపల్లి శైలజ, శ్రీకాకుళం ఎంపీడీఓ

## ఆదమరిస్తే అంతే..



ఎచ్చెర్ల మండల కేంద్రంలోని వెంకటేశ్వర కాలేజీ పక్కన రహదారి మలుపు వద్ద కాలువ పలక ఊడిపోయింది. ఆర్డీవో కార్యాలయం, ఎచ్చెర్ల కాలేజీలకు వెళ్లేందుకు ఇదే దారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. పలకలు లేకపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– ఎచ్చెర్ల

## పొంచి ఉన్న ప్రమాదం



వాండ్రంగి గ్రామంలో పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరుకుంది. భవనం నిర్మించి కొన్ని దశాబ్దాలు కావడంతో స్తంభాల నుంచి ఇనుప ఊచలు బయటకు కనిపిస్తున్నాయి. ఇక్కడే తరచూ గ్రామస్తులు సమావేశమవుతుంటారు. భవనం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

– జి.సిగడాం

## హమ్మయ్యా..దాహార్తి తీరింది!



మండుతున్న ఎండలకు మూగజీవులు అల్లాడిపోతున్నాయి. తాగేందుకు నీరు లేక విలవిల్లాడుతున్నాయి. ఈ క్రమంలో ఎక్కడ చెరువులు కనిపించినా దాహార్తి తీర్చుకునేందుకు ఆరాటపడుతున్నాయి. జి.సిగడాం మండలం సీతంపేట –పెంట గ్రామాల మధ్య సాలానివాని చెరువులో మూగజీవులు ఇలా దాహం తీర్చుకుంటున్నాయి.

– జి.సిగడాం

# పట్టుదలతో చదివితే ఉజ్వల భవిష్యత్



విద్యార్థుల నృత్య ప్రదర్శన

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరాలని ఐఎఫ్ఎస్ అధికారి ఎస్. వెంకటేష్ ఆకాంక్షించారు. సంత సీతారాంపురంలోని స్కై వ్యవసాయ కళాశాలలో శనివారం కాలేజ్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రికల్చరల్ బీఎస్సీ చదివిన విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సమయం విలువ గుర్తించి సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాల నైపుణ్యాలపై దృష్టిపెట్టాలని చెప్పారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో శాస్త్రవేత్త పి.భావన, డీన్ మోష, యాజమాన్య సభ్యులు సనపల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ఇస్రో మాజీ చైర్మన్ మృతికి సంతాపం

శ్రీకాకుళం అర్బన్: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) మాజీ చైర్మన్ డాక్టర్ కుమారస్వామి కస్తూరి రంగన్ మృతి పట్ల శర్వాణి విద్యాలయ వ్యవస్థాపకుడు అంధవరపు సూరిబాబు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇస్రో చైర్మన్‌గా కస్తూరి రంగన్ సేవలు ఎనలేనివని కొనియాడారు. పీఎస్ఎల్‌వీ, జీఎస్ఎల్‌వీ ప్రయోగాలు కస్తూరి రంగన్ హయాంలోనే సాకారమై భారత్ అంతరిక్ష పరిశోధనల్లో గణనీయమైన స్థానాన్ని సాధించగలిగిందని పేర్కొన్నారు. కస్తూరి రంగన్ ఆలోచనలు, కృషి, వ్యక్తిత్వాన్ని నేటితరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భారత అంతరిక్ష పరిశోధనలకు ఆయన మృతి తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శర్వాణి విద్యాలయ కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, హెచ్‌ఎం కె.రేఖ తదితరులు నివాళులు అర్పించారు.

## అరసవల్లిలో మహాలింగార్చన



మహాలింగార్చన నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి: ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో పంచాయతన సహిత మహాపర్వ లింగార్చన కార్యక్రమం ఘనంగా జరిగింది. మాస శివరాత్రి సందర్భంగా శనివారం ఉదయం ఆలయ అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదపండితుల సమక్షంలో అర్చకులు ఇప్పిలి సాందీపశర్మ రుద్రాభిషేకం, లింగార్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు.

# వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు పరామర్శ



మెట్టవలసలో కార్యకర్తలను పరామర్శిస్తున్న గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం: మండల పరిధిలోని పలువురు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం పరామర్శించారు. పెంట గ్రామానికి చెందిన సర్పంచ్ పున్నాన అక్కలనాయుడు తల్లి కాంతమ్మ ప్రమాదవశాత్తు ఇటీవల గాయపడ్డారు. మెట్టవలసకు చెందిన డకర సురేష్ తల్లి శస్త్రచికిత్స చేయించుకున్నారు. గేదెలపేటకు చెందిన గేదెల వాసు ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను కిరణ్ పరామర్శించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు డోల వెంకటరమణ, మండల పరిషత్ ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీలు గేదెల నారాయణరావు, మక్క శ్రీనివాసరావు, డకర కృష్ణ, డకర రామకృష్ణ, బైరెడ్డి విష్ణుమూర్తి, డకర సన్యాసినాయుడు, బత్తుల చంద్రరావు,కార్యకర్తలు డకర శివ, లాభాన కన్నంనాయుడు, కిల్లారి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల క్యాంపస్: మండల పరిధిలోని పలువురు నాయకులు, కార్యకర్తల కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే కిరణ్ పరామర్శించారు. బడివానిపేటలో గాయపడిన ఎంపీటీసీ కొమర సోమయ్య, భగీరథపురంలో అనారోగ్యానికి గురైన వైఎస్సార్ సీపీ నాయకుల కుటుంబ సభ్యులను, ధర్మవరంలో శస్త్రచికిత్స చేయించుకున్న సర్పంచ్ అల్లు కన్నబాబు సోదరుడిని పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సనపల నారాయణరావు, మండల పార్టీ అధ్యక్షులు బోర సాయిరాంరెడ్డి, నాయకులు జరుగుళ్ల శంకరరావు, బెండు రామారావు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు



మొండేటివీధిలో శివకామేశ్వర స్వామికి అలంకరణ



ఉమారుద్రునికి హారతి



ఉమాజఠలేశ్వరస్వామికి అభిషేకాలు

శ్రీకాకుళం కల్చరల్: మాస శివరాత్రి సందర్భంగా శనివారం శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నగరంలోని ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు చేసి అనంతరం హారతులు ఇచ్చి అలంకరణ చేశారు. నక్కవీధిలోని ఉమాజఠలేశ్వర స్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు అశ్వనీకుమార్, మహేష్ ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు జరిగాయి. మొండేటివీధిలోని లలితాదేవి సహిత శివ కామేశ్వరస్వామి వారి ఆలయంలో నందీశ్వరునికి, శివకామేశ్వరునికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరణ చేశారు.

# అయ్యప్ప ఆలయం.. ఉత్సవాలకు సిద్ధం

- 28 నుంచి మూడు రోజుల పాటు ప్రతిష్టాపన మహోత్సవాలు
- నూతన ధ్వజ స్తంభ పునఃప్రతిష్ట
- ప్రధాన కలశాలకు మహా కుంభాభిషేకాలు



అయ్యప్పదేవాలయం

శ్రీకాకుళం కల్చరల్ : జిల్లాలోనే ప్రఖ్యాతిగాంచిన బలగలోని అయ్యప్పస్వామి దేవాలయం ప్రతిష్టాపనోత్సవాలకు సిద్ధమైంది. నూతన ధ్వజ స్తంభం పునఃప్రతిష్టాపన సందర్భంగా ఈ నెల 28 నుంచి మూడు రోజుల పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు పూర్తి చేశారు. 28 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ఆలయంలోనే జిల్లాకు చెందిన భక్తులు ఎక్కువగా మాలాధారణ, మండల దీక్షలు చేపడుతుంటారు.

### యాగ ఉత్సవాలు..

ఆలయం వద్ద ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మహాకుంభాభిషేక విమాన కలశ ధ్వజ స్థంభ పునఃప్రతిష్ఠ త్రయాహ్నిక యాగ మహోత్సవాలు నిర్వహించనున్నారు. 28న ప్రధాన కలశ సహిత సహస్ర పంచలోహ కలశార్చన, మూల మంత్ర హోమం, మహా రుద్రహోమాలు, 29న సుదర్శన హోమం, సుబ్రహ్మణ్య హోమం, పునఃప్రతిష్టా మూల మంత్ర హవనం, 30న అక్షయ తృతీయ సందర్భంగా ఆలయ మహా కుంభాభిషేకం, విమాన కలశ ధ్వజస్తంభ పునఃప్రతిష్ట కార్యక్రమాలు జరుగుతాయి. శబరిమల మేల్ శాంతి ఎం.ఎన్ రేజి కుమార్ నీలకంఠన్ నంబూద్రి బృందం ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

### 28 ఏళ్లకు పైగా చరిత్ర

1987లో కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామి ఆదేశానుసారం అక్షయ తృతీయ తిథి నాడు ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. అప్పటి గ్రామపెద్దలు పేర్ల గోవిందరాజులు, కేకే ప్రేమ్‌జీ, పేర్ల రామకృష్ణారావు, రెడ్డి చిరంజీవులు, ఇతర గురుస్వాములు కమిటీ సభ్యులుగా ఏర్పడ్డారు. నిర్మాణ పనులు చూసేందుకు శబరిమల నుంచి పందళరాజు రాజరాజ నరేంద్ర వర్మ, శబరిమల ప్రధాన అర్చకులు నీలకంఠ రామమహేశ్వరతంత్రి, ట్రావెన్ కోర్ దేవస్థానం శిల్పాచార్యులు వెలయప్పశాస్త్రి హాజరయ్యారు. భక్తుల సహకారంతో 1996 నాటికి ఆలయ నిర్మాణం పూర్తయ్యింది. గణపతి సచ్చిదానంద స్వామీజీ ఆదేశాలతో 1997 మే 9న వైశాఖ శుద్ధ అక్షయ తృతీయ నాడు తిరుమల తిరుపతి దేవస్థానం వేద పండితులు గోపాలం ఘనాపటి, దేవరకొండ శ్రీరామమూర్తి శిష్య బృందం ఆధ్వర్యంలో సింహాచలేశ్వరుని చందనోత్సవం నాడు.. ధృవమూర్తిగా అయ్యప్పస్వామి, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, భవానీశంకరుడు, వేంకటేశ్వరుడు, మహాలక్ష్మి అమ్మవారు, నవగ్రహాలు, ఆంజనేయస్వామి వార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. దినదినాభివృద్ధి చెందుతున్న ఈ ఆలయం వద్ద మణిగంగా పుష్కరిణి ఏర్పాటు చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షులు రెడ్డి చిరంజీవులు, కార్యదర్శి దానేటి రాజారావుల కృషితో సింహద్వార నిర్మాణం జరిగింది. దీక్షాపరులకు భవనం కూడా ఆలయ ప్రాంగణంలోనే నిర్మించారు. అయ్యప్ప భక్తులకు ఉచిత అన్నప్రసాద వితరణ కోసం షెడ్డు సిద్ధం చేశారు.

### ఏటా జరిగే ఉత్సవాలివే..

దేవాలయానికి ప్రధాన అర్చకులుగా దేవరకొండ శంకరనారాయణ శర్మ, సహ అర్చకులుగా మణిశర్మ, కిరణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో నిత్యం స్వామివారికి అర్చనలు, పూజలు నిర్వహిస్తుంటారు. మకర సంక్రాంతి, మహాశివరాత్రి, అయ్యప్పస్వామి జన్మనక్షత్ర పూజలు, విషు ఉత్సవం, ఆలయ ప్రతిష్టాపన వార్షికోత్సవం, హనుమజ్జయంతి, ఓణం ఉత్సవం, శ్రావణమాసంలో మహాలక్ష్మీ అమ్మవారికి విశేష కుంకుమార్చనలు, సామూహిక వరలక్ష్మీ వ్రతాలు, చిలుకల ద్వాదశినాడు అయ్యప్ప స్వామివారికి తెప్పోత్సవం, తిరువీధి ఉత్సవం జరుగుతుంది. మండల కాల పూజలు, మాలధారణ ఇరుముడి, ఆరాట్ బ్రహ్మోత్సవాలు తదితర ఉత్సవాలు నిర్వహిస్తుంటారు.



మూలవిరాట్ అయ్యప్పస్వామి

### సుందరం.. అయ్యప్ప దర్శనం



ఎంతో మహిమగల స్వామి అయ్యప్ప. వేలాది మంది భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. ఇక్కడ పూజలు, ఇరుముడులు అన్ని శాస్త్రోక్తంగా జరుగుతాయి. నిత్యం భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటారు.

– దేవరకొండ శంకర నారాయణశర్మ, ప్రధాన అర్చకులు, బలగ అయ్యప్ప దేవాలయం

## ముఖ్యమంత్రికి వినతులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. బుగడుట్లపాలెం పర్యటనలో భాగంగా శనివారం ఎమ్మెల్యే ఈశ్వరరావు పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు, నారాయణపురం, తోటపల్లి, మడ్డువలస ప్రాజెక్టుల పరిధిలో సాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాగా, సభలో భాగంగా సీఎం పదే పదే ఎమ్మెల్యేను శంకర్, శంకర్ అంటూ ప్రస్తావించారు. వేదికపై ఉన్నవారు ఈశ్వరరావు అంటూ గుర్తు చేయటంతో తప్పు సరిదిద్దుకొని ఈశ్వరరావు అంటూ పేరు ప్రస్తావించారు.

రణస్థలం: మండలంలోని కొచ్చెర్ల పంచాయతీ నుంచి వీడదీసి కొత్తముక్కాం, కొమరవానిపేట గ్రామాలను కలిపి కొత్త ముక్కాం గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని గ్రామపెద్దలు శనివారం సీఎం చంద్రబాబు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావులకు వినతిపత్రం అందజేశారు.